సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం ∣ 27 ∣ మే ∣ 2025



దారి లేదు.. తాగునీరు రాదు

అధికారుల సమన్వయలోపం ప్రజలకు శాపమైంది. దారిని ఆపేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. - 8లో



చిన్నారులకు వ్యాక్సినేషన్

చిన్నారులకు వ్యాక్సినేషన్ శిబిరాలు ఏర్పాటు చేశారు. మీజిల్స్. రూబెల్లా వ్యాక్సిన్లు వేయనున్నారు. - 8లో

నేడు ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి నిర్వహించనున్నట్లుగా ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలియజేశారు. ఈ మేరకు పోలీస్, రెవెన్యూ తదితర శాఖ సిబ్బంది సమక్షంలో నిబంధనల ప్రకారం లెక్కింపు ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన తెలియజేశారు.

న్యూస్‌రీల్

వ్యవసాయ డిప్లమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించే వ్యవసాయ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తొగరాం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీపాన నీలవేణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 16వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు www.angrau.ac.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సందేహాల నివృత్తికి పట్టణ శివారులో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో ఉన్న వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు. దూర ప్రాంతాల వారు 7702394824 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ నీలవేణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్‌కు పీహెచ్‌సీలు ఎంపిక



కలెక్టర్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న పీహెచ్‌సీ వైద్యులు

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలోని 24 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లతో పాటు ఆరు అర్బన్ పీహెచ్‌సీ కేంద్రాలు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్‌కు ఎంపికయ్యాయి. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సోమవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో ఆయా ఆస్పత్రుల అధికారులను ఘనంగా సత్కరించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డోల (పీహెచ్‌సీ పోలాకి), ధర్మవరం (పీహెచ్‌సీ పొన్నాడ), తండ్యాంవలస (పీహెచ్‌సీ సింగుపురం), తూలుగు (పీహెచ్‌సీ గార), తిమడాం (పీహెచ్‌సీ సైరిగాం) తదితర ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు కలెక్టర్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగం భూములకు 29న సాగు వేలం

జలుమూరు: శ్రీముఖలింగం భూములకు 29న సాగు వేలం వేయనున్నామని ఈఓ పి.ప్రభాకరరావు సోమవారం తెలిపారు. మొత్తం ఆరు బిట్లుగా విడదీసి వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలం పాటలో దక్కించుకున్న వారు ఒక ఏడాది మొత్తం ముందుగా చెల్లించాలన్నారు. సాగు కాలం మూడేళ్లకు హక్కులు ఉంటాయని ఆయన తెలిపారు.

ప్రభుత్వాల వైఖరి దుర్మార్గం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో 27 మంది మావోయిస్టులను కాల్చి చంపడం, బంధువులకు మృతదేహాలను అప్పగించకపోవడం దారుణమని సిపిఐఎంఎల్ మాజీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఎస్‌కే గౌష్, పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, న్యాయవాది కూకలకుంట్ల రవి, పౌర హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమనారాయణ మండిపడ్డారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలో ఏపీ ఎన్‌జీఓ హోమ్‌లో వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆర్టికల్ 14,21,19 లను ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్నాయన్నారు. మావోయిస్టు లేదా దేశపౌరులు ఎవరైనా తప్పు చేస్తే చట్టప్రకారం శిక్షించాలని, ఒక మనిషిని వేరే మనిషి చంపే హక్కు భారత చట్టాల్లో ఎక్కడా లేదన్నారు. మావోయిస్టులను ఆదివాసీలను చంపడానికి ప్రత్యేక సాయుధ బలగాలను ఆపరేషన్ కగార్ పేరుతో ఏర్పాటు చేయడం రాజ్యాంగ వ్యతిరేకం, చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు. అంతర్గత పోరాటంగా ఉన్న కగార్ ఆపరేషన్‌లో చనిపోయిన బంధువులకు అప్పగించకపోవడం న్యాయ సూత్రాలకు కూడా విరుద్ధమన్నారు. ఈ సమావేశంలో పౌర హక్కుల సంఘం తెలంగాణ నాయకులు రేవల్లె రాజా నందం తదితరులు పాల్గొన్నారు.



రూ.5 లక్షలిస్తే ఉద్యోగం నీకే..!

- 'మెడికల్ ఇన్వాలిడేషన్' కింద అక్రమంగా ఉద్యోగం ఇవ్వడానికి స్కెచ్
- గత కలెక్టర్ తిరస్కరించినా.. మళ్లీ ప్రయత్నాలు
- చక్రం తిప్పుతున్న కీలక ఉద్యోగి

అరసవల్లి:

'మెడికల్ ఇన్వాలిడేషన్..' జిల్లా వైద్యారోగ్య శాఖలో గత కొన్ని రోజులుగా నలుగుతున్న పేరు. వాస్తవానికి మెడికల్ ఇన్వాలిడేషన్ కోటా కింద అంటే ఒక ఉద్యోగి అనారోగ్య కారణాల రీత్యా పని చేయలేకపోతే అర్హతలు ఉన్న వారసులకు కొలువు లభిస్తుంది. కానీ జిల్లా వైద్యారోగ్య శాఖలో మాత్రం అర్హతలతో సంబంధం లేకుండా 'ఆదాయం' లెక్కలతో ఉద్యోగం ఇప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వైద్యారోగ్య శాఖలో పనిచేసి అనారోగ్యానికి గురైన ఉద్యోగి తన వారసుడికి ఉద్యోగం ఇప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. విశేషం ఏమిటంటే ఆయన భార్య ఇదే శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. అయినా కూడా సర్వీస్ రిజిస్టర్‌లో భార్య పేరు మార్పు చేస్తూ ఉన్నతాధికారులను మేనేజ్ చేసి ఎలాగైనా ఉద్యోగం వారసునికి ఇప్పిస్తామంటూ ఓ కీలక 'గ్యాంగ్' ప్రయత్నాలు మొదలుపెట్టింది. రెండేళ్ల కిందటే ఈ అక్రమ వ్యవహారానికి శ్రీకారం చుట్టినప్పటికీ 2023లో నాటి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ దీన్ని నిర్ద్వందంగా తోచిపుచ్చేశారు. ఇప్పుడు అదే ఫైల్‌ను రన్ చేసి ఎలాగైనా ఉద్యోగం వచ్చేలా చేసేందుకు జిల్లా వైద్యారోగ్య శాఖకు చెందిన ఓ కీలక ఉద్యోగి రూ.5 లక్షలకు బేరం కుదుర్చుకున్నాడన్న వార్త దావానంలా వ్యాపించింది.

జిల్లా వైద్యారోగ్య శాఖలో ఉద్యోగిగా పనిచేస్తూ అనారోగ్యానికి గురైన ఒక వ్యక్తి ఇంటికి వెళ్లి ఈ కీలక అధికారి పరామర్శించారు. ఇదే తడవుగా మెడికల్ ఇన్వాలిడేషన్ కోటా కింద మీ అబ్బాయికి ఉద్యోగం ఇప్పిస్తానంటూ చెప్పారు. రూ.5 లక్షలకు బేరం కూడా కుదుర్చుకున్నాడు. అడ్మిన్ పరంగా ఎలాంటి అడ్డులేకుండా అక్రమంగా మెడికల్ ఇన్వాలిడేషన్ ఫైల్‌ను నడిపి తుది దశకు చేర్చాడు. అయితే ఇక్కడ నుంచే సీన్ మారిపోయింది. గత కలెక్టర్ ఇదే ఫైల్‌పై మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధమంటూ తిప్పి పంపించారనే అంశం బయటకు వచ్చింది. దీంతో స్థానిక వైద్యారోగ్య శాఖలో కొందరు ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులను ఆశ్రయించేందుకు అడుగులు వేస్తున్నారు. డీఎంహెచ్‌ఓ స్థాయి అధికారి తొలిసారిగా ఏసీబీకి దొరికినా ఈ శాఖలో ఎలాంటి మార్పులు రావడం లేదని కొందరు తెలిపారు. ఈ అక్రమ పోస్టింగ్ ప్రక్రియపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు పంపించారు.



నిబంధనలకు తూట్లు

ఎవరైనా ప్రభుత్వ శాఖ ఉద్యోగి మెడికల్‌గా అన్‌ఫిట్ అయితే ముందుగా ఆ పరిస్థితి నిజానిజాలపై అధికారులు ముందుగా మెడికల్ బోర్డుకు రిఫర్ చేస్తారు. అక్కడ ధ్రువీకరించిన తర్వాత మెడికల్లీ అన్‌ఫిట్ సర్టిఫికెట్ పొందాక.. ఈ సర్టిఫికేషన్ కింద వలంటరీ రిటైర్‌మెంట్ చేయాలని సదరు ఉద్యోగి శాఖ ఉన్నతాధికారికి విన్నవించువాల్సి ఉంటుంది. అనంతరం నియామకానికి సంబంధించి కమిటీకి కలెక్టర్ చైర్మన్, డీఎంహెచ్‌ఓ మెంబర్ కన్వీనర్‌గా ఉండగా అన్ని అర్హతలను పరిశీలించాక అర్హత ఉన్న వారసునికి ఉద్యోగం ఇవ్వాలి. అయితే తాజా వ్యవహారంలో నిబంధనలకు తూట్లు పడేలా వ్యవహారాన్ని సదరు కీలక అధికారి అన్నీ తానై నడిపించారు. ఇప్పటికే రూ.లక్షల్లో చేతులు మారిపోవడంతో ఉద్యోగం గ్యారంటీ అంటూ మళ్లీ అదనంగా డబ్బులు నొక్కేసేలా వ్యూహాలు అమలు చేస్తున్నట్లుగా సమాచారం.

నంబాల కుటుంబ సభ్యులకు తీవ్ర నిరాశ



ప్రభుత్వం తీరుపై నిరసనగా నారాయణపూర్‌లోని వీధుల్లో కేశవరావు కుటుంబ సభ్యుల నిరసన ర్యాలీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు కుటుంబ సభ్యులకు తీవ్ర నిరాశే మిగిలింది. నంబాల మృతదేహం కోసం ఛత్తీస్‌గఢ్ వరకు వెళ్లిన కుటుంబ సభ్యులు ఎన్నో ప్రయాసలు పడ్డారు. అక్కడి అధికారుల తీరుతో విసిగిపోయి నారాయణపూర్ వీధుల్లో ప్రజా సంఘాల నేతలతో కలిసి నిరసన ర్యాలీలు కూడా చేశారు. ఏకంగా నారాయణపూర్ ఎస్పీ కార్యాలయం ఎదురుగా నిల్చొని ఆందోళన చేశారు. కానీ ఖాకీలు కారుణ్యం చూపలేదు. మృతదేహం ఇస్తే స్వగ్రామం తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించుకుంటామన్న విజ్ఞప్తిని పెడ చెవిన పెట్టారు. నంబాల మృతదేహానికి పోలీసులు ఛత్తీస్‌గఢ్‌లోనే అంత్యక్రియలు పూర్తి చేసేశారు. మృతదేహాన్ని అప్పగిస్తే ఊరేగింపులు నిర్వహిస్తారు, స్వగ్రామాల్లో ర్యాలీలు చేస్తారు, అంత్యక్రియలు చేసిన చోట స్తూపాలు నిర్మిస్తారు, ఏదైనా సందర్భం వస్తే అక్కడ నివాళుల కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు, ఇలాంటి చర్యలు మళ్లీ కొందరిని నక్సలిజం వైపు ఆకర్షించే ప్రమాదం ఉందంటూ ఛత్తీస్‌గఢ్ పోలీసులు మృతదేహం ఇవ్వడానికి ముందు నుంచే నిరాకరిస్తూ వచ్చారని కేశవరావు సోదరుడు రాంప్రసాద్ వెల్లడించారు.

నాయకులను తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నారు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డిని తప్పుడు కేసుల్లో ఇరికించి అరెస్టు చేయడం దారుణమని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేక ఇప్పుడు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెగబడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరులు వెంకట్రామిరెడ్డిలపై కూడా తప్పుడు కేసులు బనాయించారని మండిపడ్డారు. వీరిపై జంట హత్యల కేసు నమోదు చేయడంతో రెడ్‌బుక్ రాజ్యాంగం పరాకాష్టకు చేరిందన్నారు. ఇంత దారుణమైన పాలన గతంలో ఎప్పుడూ రాష్ట్రంలో లేదని, ఇలాంటి అరాచక పాలన కూటమి నాయకులకే చెల్లిందని విమర్శించారు. కూటమి నాయకులకు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు.

యోగాంధ్రకు భారీ ప్రణాళికలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'యోగాంధ్ర' ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభమవుతోంది. మే 24 నుంచి జిల్లా స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇప్పటికే ప్రారంభం కాగా, మే 27 నుంచి మండల స్థాయి లో ట్రైనర్లకు శిక్షణలు ప్రారంభం కానున్నాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ప్రతి మండలంలో 200 మంది యోగా ట్రైనర్లను తయారు చేయడమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. శిక్షణలో పాల్గొన్న మాస్టర్ ట్రైనర్లు, ట్రైనర్లు, సాధకులకు ఆయుష్ శాఖ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా ద్వారా ధ్రువపత్రాలు జారీ చేయనున్నట్లు కలెక్టర్ చెప్పారు.

చారిత్రక ప్రదేశాల్లో..

మే 27న డచ్ బిల్డింగ్‌లో, జూన్ 3న అరసవల్లి సూర్యదేవాలయంలో, జూన్ 7న శాలిహుండం బౌద్ధ స్థూపాల వద్ద, జూన్ 10న కళింగపట్నం బీచ్‌లో యోగా శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రతి కేంద్రానికి వెయ్యిమంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్‌ను మొత్తం కార్యక్రమానికి సమన్వయాధికారిగా నియమించారు.

డచ్ బిల్డింగ్ వద్ద ఉత్సాహం

యోగాంధ్ర-2025 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన శ్రీకాకుళం జిల్లా అధికారులు మరింత ఉత్సాహంతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం డచ్ బిల్డింగ్ వద్ద వెయ్యిమందితో భారీ యోగా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. శిబిరాన్ని పదిభాగాలుగా విభజించి, ప్రతి బ్లాక్ ఎదురుగా ఒక యోగా నిపుణుడితో ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మొత్తం 38 నుంచి 45 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను ఏర్పాటు చేయనున్నారు. ఏర్పాట్లపై సోమవారం జిల్లా ముఖ్య అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు చేశారు.

యోగాంధ్ర షెడ్యూల్ విడుదల

యోగాంధ్ర షెడ్యూల్‌ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సోమవారం వెల్లడించారు. విభిన్న కేటగిరీల్లో ప్రదర్శనలు ఉంటాయని పాల్గొనాలనుకునే వారు తప్పనిసరిగా యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఒక్కో వయస్సు గ్రూప్‌కి ప్రత్యేక ఆసనాలు సూచించారు. గ్రామస్థాయిలో పోటీలు మే 26 నుంచి 30 వరకూ, మండలస్థాయిలో జూన్ 2 నుంచి 7 వరకు, జిల్లాల్లో జూన్ 9 నుంచి 14 వరకు, రాష్ట్రస్థాయి ఫినాలే జూన్ 16 నుంచి 18 వరకు జరగనున్నట్లు తెలిపారు.

హైకోర్టు ఆదేశించినా పాటించరా..?

పలాస: మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావుతో పాటు మిగతా వారి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించకపోవడంపై పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద సోమవారం వివిధ ప్రజాసంఘాలకు చెందిన నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. హైకోర్టు తీర్పు చెప్పినా.. ఆంధ్రా తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాలు బేఖాతరు చేస్తూ నంబాల కేశవరరావు మృత దేహాన్ని వారి కుటుంబానికి అప్పగించక పోవడం చాలా అన్యాయమని, ప్రజాస్వామిక వాదులు, పౌర సమాజం దీనిపై స్పందించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పత్తిరి దానేసు, దాసరి శ్రీరాములు, జోగి కోదండరావు, వంకల మాధవరావు,పుచ్చ దుర్యోధన, మద్దిల ధర్మారావు, మద్దిల రామారావు, కోనేరు గురయ్య, సాలిన వీరాస్వామి, పోతనపల్లి కుసుమ తదితరులు ఉన్నారు.



నిరసన తెలియజేస్తున్న వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు

పోలీసుల అదుపులో రైస్‌పుల్లింగ్ అనుమానితులు

సరుబుజ్జిలి: మండలంలోని వెన్నెలవలస వద్ద రైస్ పుల్లింగ్ చేయడానికి వచ్చినట్లు అనుమానిస్తున్న 12 మందిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రైస్ పుల్లింగ్ అనేది ఓ మోసపూరిత ప్రక్రియ. ముందస్తు సమాచారం మేరకు ఈ ముఠాపై పోలీసులు పూర్తి నిఘాపెట్టి అదుపులోకి తీసుకొని వేరే ప్రాంతంలో విచారణ చేస్తున్నట్లు సమాచారం. వీరు వేర్వేరు ప్రాంతాలకు చెందినవారు. స్థానికులు కూడా ఉన్నట్లు సమాచారం. ఇదే విషయమై ఎస్ఐ బి.హైమావతి వద్ద ప్రస్తావించగా ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నామని, పూర్తి విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని వెల్లడించారు.

ఆదివారం రాత్రి ఆ ఊరికి అమ్మవారిని తీసుకువచ్చారు. మంగళవారం గ్రామదేవత ఉత్సవం ముగించనున్నారు. జనమంతా ఆ వేడుకల్లోనే తలమునకలై ఉన్నారు. చివరి అంకానికి వచ్చిన సంబరాన్ని ఆస్వాదిస్తున్నారు. ఈ పండుగల వేళ ఊరంతా ఉలిక్కిపడేలా ఓ విద్యుత్ తీగ యమపాశం విసిరింది. మేనమామను మేనల్లుడిని కలిపి తీసుకెళ్లిపోయి ఆ కుటుంబానికి ఆధారం లేకుండా చేసింది. ఉత్సవం చూసేందుకు వచ్చిన అమ్మాయి ఆయువును ఆపేసి ఆ ఇంట చీకటి నింపింది. ఈ దుర్ఘటనతో సామంత పుట్టుగ పుట్టెడు దుఖంలో మునిగిపోయింది.



మృతదేహాల వద్ద కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

వదిలేసిన తీగే.. యమపాశమైంది

- విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతి
- సామంతపుట్టుగలో ఘటన
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- గ్రామ ఉత్సవాలకు వాడిన విద్యుత్ అలంకరణ తీగే ప్రమాదానికి కారణం

కంచిలి:

సామంతపుట్టుగ(చిల్లపుట్టుగ)లో సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో విద్యుత్ షాక్‌కు గురై ముగ్గురు చనిపోయారు. మరో ఇద్దరు ఆస్పత్రిలో ప్రాణాల కోసం పోరాడుతున్నారు. గ్రామదేవత ఉత్సవాల చివరి అంకంలో జరిగిన ఈ విషాద సంఘటనతో గ్రామమంతా శోకమయమైంది. వివరాల్లోకి వెళితే..

సామంతపుట్టుగ గ్రామంలో గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారి ఊరేగింపు జరిగింది. గ్రామంలోకి అమ్మవారు వచ్చి వెళ్లిన తర్వాత ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణను సోమవారం ఉదయం తొలగించారు. కానీ ఒక జీఏ వైరును మాత్రం విడిచిపెట్టేయగా.. అది తెగి కింద పడింది. ఆ స్థలంలో ఆడుకుంటున్న చిన్నారులు ఆ తీగను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనలో మొదట బాడపల్లి నందిని (12) అనే బాలిక తెగిపడిన జీఏ వైరు చుట్టుకుని షాక్‌కు గురి కాగా.. ఆ బాలికను కాపాడబోయి చిల్ల ఈశ్వర్(28) విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆ వెనుకనే ఉన్న నాలుగేళ్ల బాలుడు నొళియా కృష్ణకు కూడా షాక్ తగిలింది. వీరు ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు కూడా విద్యుత్ షాక్‌కు గురై తీవ్రగాయాలపాలయ్యారు. మరికొందరు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు.



పెంట కుప్ప మీద పారేసిన సర్వీసు వైరు

ఆ తీగే ప్రాణాలు తీసింది..

గ్రామదేవత ఉత్సవాల సందర్భంగా తమంతటతామే విద్యుత్ అలంకరణ చేసుకోడానికి స్థానిక కమిటీ యువత బరంపురం వెళ్లి విద్యుత్ అలంకరణ చేసే సీరియల్ సెట్లు గుత్తులు తీసుకొచ్చారు. వారే సొంతంగా అమర్చుకున్నారు. సంబరాలు మంగళవారంతో ముగియనుండటంతో విద్యుత్ అలంకరణను సోమవారం ఉదయం తొలగించేశారు. కానీ ఈ లైటింగ్ కోసం కరెంటు సరఫరా చేసిన లైన్‌ను మాత్రం తొలగించలేదు. అదే ఇంత పెద్ద ప్రమాదానికి కారణమైంది. విద్యుత్ ఉపకరణాలకు ఏర్పాటు చేసిన జీఏ వైరు తీగ కింద పడిపోవడం, అక్కడే వీధిలో ఆటలాడుకుంటున్న చిన్నారులు గమనించకపోవడంతో ఈ విషాదం చోటు చేసుకుంది. సంఘటనలో తీవ్రంగా గాయాలపాలైన పొడియా మనోజ్‌ను సోంపేట ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా, మెరుగైన చికిత్స కోసం బరంపురం మెడికల్‌కు తరలించారు. గాయపడిన చిల్ల తరుణ్ అనే మరో వ్యక్తి నాలుగు రోజుల కిందటే బయటి దేశం నుంచి గ్రామానికి వచ్చాడు. ఇతను సోంపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



గుమిగూడిన జనం

ఆ కుటుంబానికి దిక్కేదీ.?



ఈశ్వర్ (ఫైల్)



కృష్ణ (ఫైల్)



నందిని(ఫైల్)

ఘటనలో మృతి చెందిన చిల్ల ఈశ్వర్ కుటుంబానికి తనే ఆధారం. ఈశ్వర్ డిగ్రీ వరకు చదువుకొని, గ్రూప్స్ ప్రిపరేషన్ కోసం శ్రీకాకుళం వెళ్లి అక్కడ ఒక హోటల్‌లో చెఫ్‌గా పని చేస్తున్నాడు. ఈశ్వర్‌కు కవిటి మండలం బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన యువతితో రెండేళ్ల కిందటే వివాహం నిశ్చయమైంది. ఏడాది కిందట ఈశ్వర్ చెల్లెలి భర్త మృతి చెందడంతో వివాహం వాయిదా పడింది. ఈశ్వర్ తండ్రి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. చెల్లెలికి కూడా భర్త లేకపోవడంతో రెండు కుటుంబాలను ఈశ్వర్ ఒక్కడే చూస్తున్నాడు. 42 ఏళ్ల తర్వాత గ్రామదేవత ఉత్సవాలు జరుగుతుండడంతో ఆదివారం మధ్యాహ్నమే అతను స్వగ్రామానికి వచ్చాడు. ఉత్సాహంగా ఉత్సవంలో పాల్గొన్నాడు. కానీ విధి వక్రీకరించి సోమవారం ఉదయం ప్రమాదానికి గురై విగతజీవిగా మారాడు. మరో నెల రోజుల్లో ఈశ్వర్‌కు పెళ్లి ముహూర్తం ఖరారు చేయాలని అనుకుంటుండడంగా ఈ ప్రమాదం జరగడంతో కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. మృతుల్లో ఒకడైన నాలుగేళ్ల బాలుడు నొళియా కృష్ణ ఈశ్వర్ చెల్లెలి లక్ష్మి కుమారుడు. వీరిది బంజిరి నారాయణపురం గ్రామం. ఉత్సవాలు చూసేందుకు రాగా.. ఈ ప్రమాదం జరిగింది.

దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాడపల్లి నందిని స్వగ్రామం పురుషోత్తపురం గ్రామం. ఈ బాలిక కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి పూర్తిచేసుకుంది. ఉత్సవాలు చూసేందుకు శుక్రవారం తన పిన్ని ఇంటికి వచ్చింది. ఇంతలో చావు ఎదురైంది. మృతురాలి తల్లిదండ్రులు రాజేశ్వరి దీనబంధు బాలిక మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదించారు.

గోప్యంగా ఉంచేందుకు..

సోమవారం ఉదయం 8గంటలకు ఈ సంఘటన జరిగినప్పటికీ బయటకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచేందుకు గ్రామ స్తులు ప్రయత్నించారు. విద్యుత్ శాఖ అధికారులను రానీయకుండా, మీడియా వాళ్లను కూడా ఏమార్చి ఏమీ జరగనట్టు నమ్మించే ప్రయత్నం చేశారు. పోలీసులు, మీడియా వారు గ్రామానికి చేరుకోవడంతో విషయం బయట ప్రపంచానికి తెలిసింది. సోంపేట సీఐ బి.మంగరాజు, కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు దర్యాప్తు చేపట్టారు. మధ్యాహ్నం రెండు గంటలకు సోంపేట విద్యుత్‌శాఖ ఏడీ ఎం.రవికుమార్, కంచిలి ఏఈ ఎన్.గురవయ్య, మిగతా సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొన్నారు. తర్వాత ఎస్ఈ ఎస్.కృష్ణమూర్తి చేరుకొని సమీక్షించారు. అదేవిధంగా పలాస ఆర్డీఓ వెంకటేశ్వరరావు, స్థానిక తహసీల్దార్ ఎన్. రమేష్‌కుమార్, ఆర్ఐ కృష్ణచంద్ర రాళో, వీఆర్ఓ దుద్ది మురళి కూడా వచ్చి పరిశీలించారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు వచ్చి ఆరా తీశారు.

క్లుప్తంగా

సర్టిఫికెట్ల పరిశీలన నేడు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఖాళీగా ఉన్నటువంటి హెచ్ఎం పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన టీచర్ల సర్టిఫికెట్లను మంగళవారం పరిశీలించనున్నారు. జిల్లాలోని అన్ని జిల్లా పరిషత్, మున్సిపల్ మేనేజ్‌మెంట్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీ(పదవీ విరమణ, మరణం, రీ అపోర్షన్ కారణంగా)గా ఉన్న హెచ్ఎం పోస్టులను అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేటగిరిల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో భర్తీ చేయనున్నట్లు డీఈవో డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 83 హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సీనియారిటీ జాబితాను శ్రీకాకుళం డీఈఓ.ఓఆర్జీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు చెప్పారు. సీనియారిటీ జాబితాలో పేర్కొన్న అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేటగిరి ఉపాధ్యాయులు మాత్రమే 27వ తేదీన ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం ప్రభుత్వ(బాలుర) ఉన్నత పాఠశాల వేదికగా జరిగే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలని సూచించారు. వారి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు సర్వీస్ రిజిస్టర్ తమవెంట తీసుకురావాలని స్పష్టం చేశారు.

జిల్లాలో చిన్నారులకు వ్యాక్సినేషన్

- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి అనిత వెల్లడి



అరసవల్లి: జిల్లాలో చిన్నారులకు ఆటలమ్మ, రూబెల్లా వ్యాధులు సంక్రమించకుండా అన్ని ఆరోగ్య కేంద్రాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత తెలియజేశారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో ప్రత్యేక శిబిరాల ఏర్పాటు చేసి మూడు విడతలుగా వ్యాక్సినేషన్ చేసేలా చర్యలు చేపట్టనునట్లు వివరించారు. మొదటి విడతగా ఈనెల 26 నుంచి 31 వరకు, రెండో విడతగా వచ్చే జూన్ 23 నుంచి 28 వరకు, అలాగే మూడో విడతగా జూలై 21 నుంచి 26 వరకు ఈ ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లుగా వివరించారు. ఈ ప్రక్రియను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రామదాస్ పర్యవేక్షణలో చేపతామని వివరించారు.

నిద్రమత్తులో లారీ బోల్తా



బోల్తాపడిన తవుడు లారీ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి 10వ వార్డు పారసాంబ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై లారీ బోల్తాపడింది. ఇచ్ఛాపురం నుంచి టెక్కలి వైపు వెళ్తుండగా పలాస దాటిన అనంతరం డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడంతో రోడ్డుపక్కకు వెళ్లిపోయింది. అప్రమత్తమైన లారీ డ్రైవర్ ఒక్కసారిగా అదుపుచేసినప్పటికీ తవుడు లోడుతో ఉన్నటువంటి లారీ పల్టీలుకొట్టింది. లారీ డ్రైవర్, క్లీనర్ గాయాలతో బయటపడ్డారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోశాధికారిగా శ్రీనివాసరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ ఎన్జీవోస్ విజయవాడ కార్యాలయంలో నిర్వహించిన ఏపీటీఎస్ఏ రాష్ట్ర కార్యవర్గం ఎన్నికల్లో జిల్లాకు చెందిన బొత్స శ్రీనివాసరావుని ఆ సంఘం కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు విజయవాడలో ఆదివారం జరిగాయి. రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై శ్రీకాకుళం జిల్లా ఏపీటీఎస్ఏ అధ్యక్షుడు దొడ్ల శ్రీరామ్‌కుమార్, జిల్లా కార్యదర్శి డేవిడ్ మాదారపు ఇతర కార్యవర్గం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పోలీసుల అదుపులో బెట్టింగ్ రాయుళ్లు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో బెట్టింగ్ మాఫియా మూలాలు పెరుగుతున్నాయి. సోమవారం ఒక్కరోజే అటు సీసీఎస్ స్టేషన్‌లోను, ఇటు టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలోను, రూరల్, ఎచ్చెర్ల, వన్‌టౌన్ పీఎస్‌ల్లో సుమారు 13 మందిని విచారించినట్లు తెలుస్తోంది. వీరిలో ప్రధాన బుకీ డి.శ్రీనివాస్ కూడా ఉండటం విశేషం. దొరికిన వారికి విశాఖలోని పెద్ద బుకీలతో సంబంధాలు ఉన్నట్లు సమాచారం. నిందితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.



వాహనాల రాకపోకలు సాగకుండా అడ్డుగా పెట్టిన బారికేడ్లు

దారి లేదు.. తాగునీరు రాదు

- ప్రజలకు శాపంగా అధికారుల సమన్వయ లోపం
- నాలుగు రోజులైనా పూర్తవ్వని రోడ్డు పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు



పైపులైన్ల మరమ్మతులు చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు



చెరువు గట్టు మీదుగా వెళ్తున్న ఆటోలు

టెక్కలి రూరల్: నాలుగు రోజుల క్రితం స్థానిక గోపినాథపురం సమీపంలో రహదారి మధ్యలో ఏర్పడిన రంధ్రాన్ని పూడ్చేందుకు నిర్వహించిన పనుల్లో సంబంధిత అధికారులు మధ్య ఏర్పడిన సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారింది. రహదారి మరమ్మతుల్లో భాగంగా రహదారి కింద ఉన్న పైపులైన్లను తొలగించారు. దీంతో అధికంగా తాగునీరు వృథాగా పోయిన విషయం తెలిసిందే. అయితే అధికారులు పైపులైన్లు మరమ్మతులు చేసేందుకు గాను రాకపోకలు నిలిపివేసి నాలుగు రోజులు అవుతున్నప్పటికీ ఆ పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ విషయం...

గోపినాథపురం సమీపంలో రోడ్డు మధ్యలో చిన్నపాటి రంధ్రం ఏర్పడింది. అయితే ఆ రంధ్రం మరమ్మత్తులు చేసేందుకు పోర్టుకు సంబంధించిన సిబ్బంది స్థానిక అధికారులతో చర్చించకుండా రహదారిని జేసీబీ సాయంతో తవ్వేశారు. దీంతో కింద నుంచి వెళ్తున్న ప్రధాన పైపులైన్లతో పాటుగా పంచాయతీ పైపులైన్లు సైతం మరమ్మతులకు గురవ్వడంతో ఈ సమస్య ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నారు.

తాగునీటి కష్టాలు

రహదారి పనుల్లో భాగంగా రోడ్డు కింద నుంచి వెళ్తున్న పైపులైన్లు తవ్వేయడంతో అటు పంచాయతీ, ఇటు ఆర్‌డబ్ల్యూఎస్‌కి సంబంధించిన రెండు పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో నాలుగు రోజులుగా ప్రజలకు తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా గోపినాథపురం, ఆర్డీవో కార్యాలయం సమీప ప్రాంతాలు, బర్మాకాలనీ, జయకృష్ణపురం, మునసబుపేట, చిన్ననారాయణపురం, ధర్మానీలాపురం, రావివలస, బీసీ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నిలిచిన రాకపోకలు

మరమ్మతుల్లో భాగంగా రహదారి మొత్తం తవ్వేయడం వలన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ మార్గం గుండా రాత్రి, పగలు వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతూనే ఉంటాయి. అలాంటి ఈ మార్గంలో నాలుగు రోజులుగా రాకపోకలు నిలిపి వేయడంతో వాహనదారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. టెక్కలి నుంచి సంతబొమ్మాళి, నౌపడ, నౌపడ ఆర్ఎస్, మూలపేట, పూండీ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ఈ మార్గంలో బస్సు సౌకర్యం నిలిపివేయడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. మిగిలిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు సమీపంలోని చెరువు గట్టుమీదుగా ప్రమాదకరంగా నడుపుతున్నారు.

తాగేందుకు నీరులేదు



గోటితో పోయేదాన్ని గొడ్డలిదాక తెచ్చుకున్నట్లు అధికారుల సమన్వయ లోపంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో నాలుగు రోజులుగా రాకపోకలకు అంతరాయం ఏర్పడటమే కాకుండా, సమీప ప్రాంత ప్రజలు తాగేందుకు నీరు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

– సత్తారు సత్యం, గోపినాథపురం

ఇబ్బంది పడుతున్నారు



రహదారి మరమ్మతుల్లో భాగంగా పైపులైన్లు తవ్వేయడంతో నేటికి నాలుగు రోజులుగా కుళాయిలు ద్వారా తాగునీరు రావడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది తాగేందుకు నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు వేగవంతం చేయాలి.

– తమ్మన్నగారి కిరణ్, రోణంకి అప్పలస్వామి వీధి, టెక్కలి

సమస్య పరిష్కరిస్తాం

రహదారి మరమ్మతులతో ప్రజలకు ఏర్పడిన సమస్యను పరిష్కరించారు. మంగళవారం రాత్రిలోపు మరమ్మతులు పూర్తిచేసి బుధవారానికి రాకపోకలకు అంతరాయం లేకుండా చేస్తాం.

– మోహన్, జేఈ, టెక్కలి

ప్రైవేటీకరణ ప్రతిపాదన ఆపాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్న సీఐటీయూ, ఇతర సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు కోరారు. స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆపాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పిలుపులో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ పుండ్కర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం తన కుట్రలు మానుకోవాలని సూచించారు. 32 మంది ప్రాణ త్యాగాలతో, వామపక్ష ఎమ్మెల్యేలు, ఎంపీల రాజీనామాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సాధించుకున్నారని గుర్తుచేశారు. 64 గ్రామాల ప్రజలు 24 వేల ఎకరాల భూములను త్యాగం చేశారని పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్‌ను రక్షిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి పార్టీలు తమ హామీని నిలుపుకోవాలన్నారు. పోరాడి సాధించిన విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి సెయిల్‌లో విలీనం చేసేందుకు ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రారావు, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చిక్కాల గోవిందరావు, సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎండీఎం యూనియన్ నాయకురాలు తూతిక ప్రవీణ, బీఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకులు ఎం.గోవర్ధనరావు, పెన్షనర్స్ యూనియన్ నాయకులు పార్వతీశం, నాగార్జున అగ్రికెమ్ యూనియన్ నాయకులు ఎ.సత్యనారాయణ, ఎల్.రామప్పడు, ఎం.రమణ, కేదారేశ్వరరావు, పి.సుధాకర్ బాబు, టి.రవికుమార్, వైఎస్సార్ జిల్లా మేధావుల విభాగం ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాలకు ఆధార్ అనుసంధానం

శ్రీకాకుళం అర్బన్: భారత ప్రభుత్వం – తపాలా శాఖ పోస్టాఫీసుల్లో ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంకు సేవింగ్స్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసేందుకు ఈనెల 31వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు పోస్టాఫీసుల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తపాలాశాఖ సూపరింటెండెంట్ వి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల్లో పోస్టాఫీసు సేవింగ్ ఖాతాలను తెరవడం, ఇప్పటికే ఉన్న ఖాతాలకు ఆధార్ లింక్ చేయడం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) మ్యాపింగ్ చేయడం జరుగునని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) చేసేందుకు వీలుగా ఈ ఖాతాలు ఉపయోగపడతాయన్నారు. జిల్లాలో ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఖాతాలను పోస్టాఫీసుల ద్వారా పునరుద్ధరణ చేయడం జరుగుతుందన్నారు. ఈ ఆధార్ సీడింగ్ జరిగిన ఖాతాలో జమ అయిన పథకాల నగదును ఏ పోస్టాఫీసులో అయినా తీసుకునే సదుపాయం కలదన్నారు. సాధారణ రోజుల్లో సైతం పోస్టాఫీసులో సేవింగ్స్ ఖాతాలు 10 ఏళ్లు నిండినవారు తెరుచుకొవచ్చునని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు.

మందుబాబుల దుశ్చర్య

కాశీబుగ్గ: పలాస మండలం గొల్లమాకన్న పల్లి గ్రామంలో మద్యం మత్తులో కొందరు విధ్వంసానికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, రోడ్డు పక్కన ఉన్న రక్షణ గోడలను ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన కొందరు జవాన్లు వితరణ చేసిన కుర్చీలు, స్తంభాలను మందుబాబులు పగలగొట్టారు. బెల్టుషాపుల కారణంగా మద్యానికి అలవాటుపడిన కొందరు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



మందుబాబుల దుశ్చర్యకు ధ్వంసమైన కుర్చీలు

ఎస్పీ స్పందనకు 62 వినతులు



శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు – పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో అర్జీదారుల నుంచి 62 వినతులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి సకాలంలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్:

ఈనెల 17వ తేదీన పీఎన్‌కాలనీ బాలభారతి జంక్షన్‌లోని శ్రీసాయిసత్య రెసిడెన్సీ సమీప నివాస గృహంలో చోరీ జరిగిన విషయం పాఠకులకు విధితమే. రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. ఎచ్చెర్ల మండలం కొత్త కూర్మినాయుడుపేటకు చెందిన జీరు సురేష్, బసవ చంద్రభూషణ్ అనే యువకులు చెడు అలవాట్లతో ఆర్థిక ఇబ్బందులు పడుతుండేవారు. దీంతో తమ అవసరాలు తీరేందుకు దొంగతనం చేయడమే సరైన మార్గమని నిశ్చయించుకున్నారన్నారు. ఈ క్రమంలో ఈనెల 17న రాత్రి 8 గంటలకు పీఎన్‌కాలనీ బాలభారతీ జంక్షన్ సమీపంలోని నందు నివాస గృహంలో ఎవరూ లేని సమయం చూసి చోరీకి పాల్పడ్డారు.

ఇంట్లో ఉన్న ఎల్ఈడీ టీవీ, ట్యాబ్, సెటప్ బాక్స్, రూ.50 వేలు నగదు, వెండి పట్టీలు, బంగారు రింగులు దొంగిలించారు. అయితే విచారణలో బంగారు రింగులు తాము తీయలేదని, తీసిన రూ.50 వేలు నగదు ఖర్చయిపోయిందని చెప్పారన్నారు. దీనిపై నిందితులు ఇరువురినీ సోమవారం రాత్రి ఎస్ఐ సంతోష్ కుమార్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారన్నారు.

కారుని ఢీకొన్న ద్విచక్ర వాహనం

- ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాద స్థలంలో కారు, ద్విచక్ర వాహనం

రణస్థలం: మండలంలోని దన్నానపేట కొత్త పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై మలుపు తిరుగుతున్న కారును అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. జేఆర్‌పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఒక ఫంక్షన్ కోసం శ్రీకాకుళం వెళ్లి అటునుంచి ద్విచక్ర వాహనంపై అన్నదమ్ములు సున్నపల్లి బోయోడు, బుల్లోడు వస్తున్నారు. దన్నానపేట పెట్రోల్ బంకు సమీపంలో కొత్తగా జంక్షన్ ఏర్పాటు చేయడంతో సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో మలుపు తిరుగుతున్న కారును వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొన్నారు. దీంతో ఇద్దరూ ఎగిరిపడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇరువురినీ 108 వాహనంపై శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇద్దరి అన్నదమ్ములు పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన వారు. సరికొత్త స్పోర్ట్స్ బైక్ కావడం అతివేగంగా వచ్చారని స్థానికులు చెబుతున్నారు. ఇంకా బైకు నంబర్ కూడా రాలేదు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'డాక్టర్ సూర్యారావు విధుల్లో చేరడం అబద్ధం'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ పి.సూర్యారావు సోమవారం విధుల్లో చేరినట్లు వార్తలు గమనించామని, అదంతా అవాస్తవమని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు బి.రాజగోపాల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఆయన విధుల్లో చేరిన విషయం సరికాదని, పై అధికారుల నుంచి ఏ విధమైన ఉత్తర్వులు రాలేదని స్పష్టం చేశారు.

రైలు ఢీకొని ఆవు మృతి

టెక్కలి రూరల్: స్థానిక గోపినాథపురం సమీపంలో సోమవారం రైలు ఢీకొని ఆవు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుణుపూర్ నుంచి నౌపడ వైపు రాజారాణి ఎక్స్‌ప్రెస్ వెళ్తున్న సమయంలో ఆవు పరిగెడుతూ రైలు పట్టాలు దాటే ప్రయత్నంలో ఉండగా ఒక్కసారిగా రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆవు కొంతదూరం ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు ఎవరిదో తెలియలేదు.



మృతి చెందిన ఆవు

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- మీకోసంలో 186 అర్జీల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక(మీకోసం)లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, డ్వామా, సర్వే అండ్ లాండ్ రికార్డులు, మహిళా శిశు సంక్షేమం, విభిన్న ప్రతిభావంతులు, సర్వశిక్షా అభియాన్, మున్సిపల్ కార్పొరేషన్, ఎక్సైజ్, ఏపీఈపీడీసీఎల్ తదితర శాఖలపై 186 అర్జీలు స్వీకరించారు. అర్జీల స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు శాఖల వారీగా ఒక్కో శాఖలో పెండింగులో ఉన్న అర్జీలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమీక్షించారు. పెండింగులో ఉన్న అర్జీలు ఎందుకు పెండింగులో ఉన్నది అడిగి తెలుసుకున్నారు.

పునరావాసం కల్పించాలి



గ్రీవెన్స్‌కి వచ్చిన బాధితులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం పురపాలక సంఘం పరిధిలో పాలకొండ రోడ్డు విస్తరణ చేయాలని చూస్తున్నారు. దీంతో ఈ రోడ్డుకి ఇరువైపులా ఇళ్లు కోల్పోతున్నవారికి పునరావాసం కింద టౌన్ పరిసరాల్లో స్థలం ఇప్పించాలని 22, 49, 50 వార్డు బాధితులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం కోరారు. ఈ రోడ్డుకి ఇరువైపులా పేదలు, చిన్న వ్యాపారస్తుల ఉన్నారని, విస్తరణలో పూర్తిగా స్థలం, ఇళ్లు కోల్పోతున్నారని వివరించారు.

బీసీ సంక్షేమ అధికారిపై కలెక్టర్ ఆగ్రహం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి అనురాధపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుమంది అవుట్ సోర్సింగ్ బాధిత కారుణ్య నియామక అభ్యర్థులు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కి ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించి కలెక్టర్ ఆరు నెలలుగా కారుణ్య నియామకాలకు సంబంధించిన అభ్యర్థులను ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని అధికారిపై అసహనం వ్యక్తం చేశారు. అవుట్ సోర్సింగ్ కారుణ్య నియామకాలు మానవతా దృక్పథంతో చేపట్టాలని సూచించారు. ఒక నెల జీతం ఆపితే అప్పుడు బాధ తెలుస్తుందని విరుచుకుపడ్డారు. వెంటనే ఈ జాప్యంపై పరిశీలించి తనకు వివరించాలని కలెక్టరేట్ ఏవో సూర్యనారాయణకి ఆదేశించారు.



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

నమ్మించి.. నట్టేట ముంచి..!

- పెళ్లి చేసుకొని దళిత యువతికి మోసం
- ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు



జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో చంటి బిడ్డతో వివాహిత మంగమ్మ

శ్రీకాకుళం క్రైమ్: ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమిస్తున్నానని నమ్మించి పెళ్లి చేసుకున్నాడని.. తనతో ఒక బిడ్డను కన్నాక దళిత మహిళ అని ఒకే ఒక్క కారణంతో తనను వదిలించుకోవాలని చూసి, అంతకుముందే నిశ్చితార్థం చేసుకున్న మరో అమ్మాయితో పరారయ్యాడని ఒక బాధితురాలు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు యర్ర మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదులో మేరకు.. ఎచ్చెర్ల మండలం ధర్మవరం గ్రామానికి చెందిన తనని 2019లో లావేరు మండలం శిగిరి కొత్తపల్లి గ్రామానికి చెందిన యర్ర శంకరరావు ప్రేమిస్తునానని చెప్పి హైదరాబాద్ తీసుకువెళ్లి పెళ్లి చేసుకున్నాడు. ఈక్రమంలో మగబిడ్డను కన్నాక తనది దళిత కులమనే ఒక్క కారణంతో అయిష్టత పెంచుకుని హింసించడం ప్రారంభించాడు. దానికి శంకరరావు కుటుంబ సభ్యులు అతనికి మద్దతు పలికేవారు. కొన్నిరోజులు మళ్లీ ప్రేమను చూపించి హైదరాబాద్ నుంచి శిగిరి కొత్తపల్లి గ్రామంలో ఉన్న తన ఇంటికి తీసుకెళ్తానని నమ్మించాడు. పైడి భీమవరం ఫార్మా కంపెనీలో డ్యూటీ చేసేందుకు అక్కడే ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని విధులకు వెళ్లేవాడు.

మరో అమ్మాయితో పరారీ

తన భర్త శంకరరావును పైడి భీమవరం నుంచి తమ ఇంటికి తీసుకెళ్లమని ఎన్నిసార్లు చెప్పినా తీసుకెళ్లేవాడు కాదని మహిళ పేర్కొంది. కారణం అడిగితే తన తల్లిదండ్రులు, అన్నదమ్ములు దళిత మహిళను తీసుకురావడానికి వీల్లేదని కుల పెద్దల సమక్షంలో తేల్చి చెప్పారని సమాధానమిచ్చాడని తెలిపింది. అంతేకాక అంతకుముందు తన భర్తతో నిశ్చితార్థం జరిగిన దుర్గలక్ష్మి అనే అమ్మాయితో ఎట్టైనా వెళ్లిపోమని కుటుంబసభ్యులు సలహా ఇవ్వడంతో ఆమెతో కలిసి పరారయ్యాడని పేర్కొంది. ఇదే విషయమై లావేరు పోలీసులకు నెల రోజుల క్రితం ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు పట్టించుకోలేదని, న్యాయం చేయమని ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డిని ప్రాధేయపడింది.